క్లుప్తంగా

3 నుంచి దసరా మహోత్సవాలు

గుడివాడ టౌన్: స్థానిక బంటుమిల్లి రోడ్డులో వేంచేసియున్న శ్రీ భీమేశ్వరస్వామి దేవస్థానం (పెద్ద శివాలయం)లో ఈ నెల మూడో తేదీ నుంచి దేవీశరన్నవరాత్రి మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు దేవస్థానం ఈఓ కె.వేణుగోపాలరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది దేవదాయ శాఖ కమిటీల నియామకం చేపట్టకపోవడంతో ఆలయ అధికారుల పర్యవేక్షణలోనే నవరాత్రి మహోత్సవాలు జరుగుతాయని పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మహోత్సవాలను జయప్రదం చేయాలని కోరారు.

దసరా నవరాత్రుల పోస్టర్ల ఆవిష్కరణ



గుడ్లవల్లేరు: శ్రీ కొండలమ్మ అమ్మవారి సన్నిధిలో ఈ నెల 3నుంచి 12వ తేదీ వరకూ నిర్వహించే దసరా నవరాత్రుల వాల్ పోస్టర్లు, బ్రోచర్లను సోమవారం గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఆయన నివాసంలో ఆవిష్కరించారు. తొలుత వేద పండితులు ఆయన్ను ఆశీర్వదించారు. ఆయనకు అమ్మవారి చిత్రపటం, కంకణంతో పాటు ప్రసాదాలను ఆలయ ఈఓ ఆకుల కొండలరావు అందజేశారు.

సబ్ రిజిస్ట్రార్‌గా రజిత

ముదినేపల్లి రూరల్: ముదినేపల్లి సబ్ రిజిస్ట్రార్‌గా సీహెచ్ రజిత సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన ఎం.మధుబాబు కృష్ణా జిల్లా కౌతవరం బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా రజిత మాట్లాడుతూ కార్యాలయానికి వచ్చే ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా పనులను సకాలంలో పూర్తిచేసి పంపుతామన్నారు.

ఉపాధ్యాయురాలికి సత్కారం



ముదినేపల్లి రూరల్: స్థానిక జెడ్పీ హైస్కూల్లో సోషల్ ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న ఏకే రెజినా సోమవారం ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా సహచర ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఘనంగా సత్కరించారు. ఏపీటీఎఫ్, యూటీఎఫ్ జిల్లా నాయకులు బేతాళ రాజేంద్రప్రసాద్, రమేష్ పాల్గొన్నారు.

గ్రామ సభలు రాజ్యాంగబద్ధంగా జరపాలి

మండవల్లి: గ్రామ పంచాయతీల్లో ఈ నెల మూడో తేదీ నుంచి నిర్వహించనున్న మూడో విడత గ్రామసభలు రాజ్యాంగబద్ధంగా జరిగేలా చూడాలని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్య వేదిక జిల్లా కన్వీనర్ ఎల్ఎస్ భాస్కరరావు, టి.అప్పారావు, బి.రంగారావు ఎంపీడీఓను కోరారు. ఈ మేరకు సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మీ కోసం కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటరమణకు వినతిపత్రం అందజేశారు.

ముంపునకు గురైన ఒక్కో ఇంటికి రూ.10వేలు

మొవ్వ: గత నెల్లో కురిసిన భారీ వరాలు, వరదలతో ముంపునకు గురైన ఒక్కో ఇంటికి ప్రభుత్వం రూ.10వేల వంతున నష్ట పరిహారాన్ని అందించనున్నట్లు తహసీల్దార్ కే మస్తాన్ సోమవారం తెలిపారు. ఈ పరిహారాన్ని నేరుగా లబ్ధిదారుల ఖాతాలో జమ చేయనున్నట్లు పేర్కొన్నారు. మండల పరిధిలోరి చినముత్తేవిలో 33, కాజలో 21, నిడుమోలులో 13, మంత్రిపాలెంలో 11 కూచిపూడిలో 3, భట్లపెనుమర్రులో 2, యద్దనపూడిలో ఒక ఇంటికి నష్ట పరిహారం అందనున్నట్లు తెలిపారు.

పార్టీలకతీతంగా రాజా సేవలు



ముదినేపల్లి రూరల్: సహకార సంఘ అధ్యక్షుడిగా పాతూరి రాజా అందించిన సేవలు మరువలేనివని ఆప్కాబ్ మాజీ చైర్మన్ పిన్నమనేని వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని చేవూరు సహకార సంఘం మాజీ అధ్యక్షుడు పాతూరి రాజా ప్రథమ వర్ధంతి, విగ్రహావిష్కరణ కార్యక్రమం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా పిన్నమనేని మాట్లాడారు. గ్రామాల అభివృద్ధికి రాజా లాంటి వ్యక్తులు ఎంతో అవసరమన్నారు. మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు, టీడీపీ నాయకులు వీరమల్లు నరసింహారావు, శోభనాద్రి చౌదరి, వినోద్, చలమయ్య, జగన్మోహన్, శేషుబాబు, వేణుగోపాల్, శ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్లు ఇలా.. ప్రయాణించేది ఎలా..!

నందివాడ మండలంలో ఆర్అండ్‌బీ రహదారులు అధ్వానంగా మారాయి. భారీ గుంతలతో పాటు రోడ్లపై రాళ్లు తేలి ప్రయాణాలకు నరకప్రాయంగా మారాయి. ఈ రోడ్లపై వెళ్లాలంటేనే ప్రయాణికులు బెంబేలెత్తుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలు, వరదల దెబ్బకు రోడ్ల పరిస్థితి మరింత దారుణంగా మారింది. అధికారులు, పాలకులు పట్టించుకోకపోవడంతో ప్రజల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

అధ్వానంగా ఆర్అండ్‌బీ రహదారులు



బురదమయంగా మారిన నందివాడ–తమిరిశ రహదారి

గుడివాడరూరల్: నందివాడ మండలం తమిరిశ నుంచి పోలుకొండ వెళ్లే జీపీకే ఆర్అండ్‌బీ రోడ్డు గుంతలమయంగా మారడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. గుడివాడ నుంచి పోలుకొండ వరకు 13 కిలో మీటర్ల మేర ఉన్న రోడ్డును ఏడు కిలో మీటర్ల మేర నిర్మించి ఆరు కిలో మీటర్ల రోడ్డు నిర్మాణం అసంపూర్తిగా వదిలేశారు. ప్రస్తుతం రోడ్డు పరిస్థితి దయనీయంగా మారింది. పెద్ద గోతులు పడి రాళ్లు లేచి ప్రయాణాలకు వీలు లేకుండా మారింది. వర్షాలు వస్తే రోడ్డు తటాకంలా మారి ప్రయాణికులకు చుక్కలు చూపిస్తోంది. ఈ ప్రాంతంలో ఆక్వా సాగు అధికంగా ఉండటంతో ప్రతిరోజూ వందల సంఖ్యలో భారీ వాహనాలు ప్రయాణిస్తూ ఉంటాయి. రోడ్డు అధ్వానంగా ఉండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రయాణికులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని రాకపోకలు సాగిస్తున్నారు. వరదల వలన రోడ్డు పరిస్థితి జఠిలంగా మారింది. గుంతల వలన ద్విచక్ర వాహన చోదకులు రోజువారీ ప్రమాదాల బారిన పడటం పరిపాటిగా మారింది. రోడ్డు దెబ్బకు గుడివాడ నుంచి పాఠశాలలు, కళాశాలలకు వచ్చే బస్సులను సైతం యాజమాన్యాలు నిలుపుదల చేయడంతో చదువుల కోసం వచ్చే విద్యార్థులు అష్టకష్టాలు పడుతున్నారు.

రాకపోకలకు అంతరాయం

కుదరవల్లి నుంచి ఎల్ఎస్‌పురం, పోలుకొండ ఆర్అండ్‌బీ రహదారి వరదల దెబ్బకు రూపుకోల్పోయింది. 13 కిలో మీటర్ల మేర రోడ్డు ఎక్కడ చూసినా గోతులు, రాళ్లే దర్శనమిస్తున్నాయి. రోడ్డు కృంగి పక్కనున్న దోసపాడు చానల్ వైపు ఒరిగిపోవడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. ముఖ్యంగా పోలుకొండ నుంచి ఎల్ఎస్‌పురం వెళ్లే రోడ్డు పరిస్థితి మరింత దిగజారడంతో రోడ్డుపై ప్రయాణమంటేనే ప్రయాణికులు భయపడిపోతున్నారు. వరదల వలన గుడివాడ నుంచి ఎల్ఎస్‌పురం వచ్చే ఆర్టీసీ బస్సును రద్దు చేయడంతో గ్రామస్తులు ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు తంటాలు పడుతున్నారు. కుదరవల్లి చెట్ల వద్ద భారీస్థాయిలో చెట్లు ఏర్పడి ద్విచక్ర వాహనాలు వెళ్లేందుకు సైతం వీలులేకపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు ప్రయాణాలకు తీవ్ర అసౌకర్యాలకు గురవుతున్నారు. పెదవిరివాడ–గొంగ్లమూడి వెళ్లే ఆర్అండ్‌బీ రహదారి పరిస్థితి ఇదేవిధంగా ఉంది. వరదల వలన 15 రోజులు రహదారి పూర్తిగా నీటిలో మునిగిపోయింది. వరదల ముంపు వలన రోడ్డు పూర్తిగా కొట్టుకుపోయి ద్విచక్ర వాహనాలు వెళ్లేందుకు వీల్లేకుండా పోవడంతో ఆయా గ్రామాల ప్రజలు కాలినడకనే ప్రయాణించాల్సిన దుస్థితి ఏర్పడింది. నందివాడ నుంచి తమిరిశ వెళ్లే రోడ్డు ఘోరంగా మారింది. రోడ్డు భారీగా దెబ్బతిని వాహన రాకపోకలు సాగించేందుకు వీల్లేకుండా పోయింది. ముఖ్యంగా మండల ప్రధాన కేంద్రానికి ప్రధాన మార్గంగా ఉన్న ఈ రోడ్డు శిథిలమవడంతో 10 గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

పట్టించుకోని అధికారులు

రోడ్లు శిథిలమై ప్రయాణాలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నా సంబంధిత ఆర్అండ్‌బీ శాఖ అధికారులు అటువైపుగా కన్నెత్తి చూడటం లేదని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. కనీసం తాత్కాలిక మరమ్మతులు అయినా చేపడతారని ఆశించినా అటుగా చర్యలు చేపట్టకపోవడంపై అధికారుల తీరుపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రోడ్లు పాడైతే పోలుకొండ పరిసర ప్రాంతాల్లోని మిల్లర్స్, ఆక్వా రైతులు చందాలు వేసుకుని తాత్కాలిక మరమ్మతులు చేపట్టడమే తప్ప అధికారులు, పాలకులు రోడ్లను పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రోడ్లను నిర్మించి పుణ్యం కట్టుకోవాలని మండల ప్రజలు వేడుకుంటున్నారు.



గుంతలతోపాటు రాళ్లు తేలిన తమిరిశ–పోలుకొండ రహదారి

నరకం అనుభవిస్తున్నాం



తమిరిశ నుంచి పోలుకొండ వెళ్లే రోడ్డు శిథిలమై నరకంలా మారింది. రోజువారీ పనుల నిమిత్తం గుడివాడ వెళ్లాలంటే ఒళ్లు హూనమవుతోంది. ఏ గుంత ఎక్కడ ఉందో తెలియక వాహనాలను నడపాలంటే భయంగా ఉంది. ఇటీవల కురిసిన వర్షాలకు పరిస్థితి మరింత దారుణంగా మారింది. రోజువారీ రోడ్డుపై ప్రమాదాలు ఎక్కువయ్యాయి. పట్టించుకునే వాడే లేడు. ఇప్పటికైనా రోడ్డు నిర్మాణం చేపట్టాలి.

– బాపూజీ, పాలవ్యాపారి

చదువులకు ఇబ్బందిగా ఉంది



కుదరవల్లి–ఇలపర్రు రోడ్డు గుంతలమయంగా మారడంతో ప్రయాణాలకు ఇబ్బంది పడుతున్నాం. రోజువారీ చదువుల నిమిత్తం గుడివాడ, ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి ఉంది. రోడ్డు గుంతలతో ఆటోలు, బస్సులు రావడం లేదు. రోజువారీ రోడ్డుపై ప్రయాణించేందుకు అష్టకష్టాలు పడుతున్నాం. రాత్రి అయితే పరిస్థితి మరింత దారుణం. రోడ్డు నిర్మించకపోతే చదువులు మానేయాలి. లేనిపక్షంలో ఊరి వదిలేసి వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. రోడ్డు నిర్మించేలా అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలి.

– బి.అయ్యప్ప, ఎల్ఎస్‌పురం

అభివృద్ధి పనులకు ప్రణాళికలు

గుడివాడరూరల్: గ్రామాల్లో అభివృద్ధి పనుల నిర్వహణకు అక్టోబర్ రెండో తేదీన అన్ని గ్రామ పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించాలని ఎంపీడీఓ అనగాని వెంకటరమణ అధికారులకు సోమవారం తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టాల్సిన స్వచ్ఛత, ఈ–సేవా చట్టం, స్వర్ణాంధ్రప్రదేశ్–2047 విజన్, మంచి ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలు తెలుపుట, 2024–25 సంవత్సరానికి ఉపాధి హామీ పనుల ప్రతిపాదనకు, శ్రమదాన కార్యక్రమాలు చేసేందుకు, శానిటేషన్ ఇన్‌ఫ్రా ప్రారంభించుట, ఓడీఎఫ్ డిక్లరేషన్ చేయడానికి ఈ సభల్లో చర్చించాల్సి ఉంటుందన్నారు. ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, ఇతర ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు గ్రామ సభల్లో పాల్గొనాలని ఆమె కోరారు. సభల ఎంపికకు ముందుగా గ్రామంలో కన్వీనర్‌ను ఎంపిక చేసుకుని తద్వారా ఎక్కడ నిర్వహించేది తెలియపర్చే విధంగా పంచాయతీ కార్యదర్శులు చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సభలు అక్టోబర్ రెండో తేదీ ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు గ్రామ సభలను ఆయా గ్రామ పంచాయతీల్లో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

చెడుప్రవర్తన మార్చుకోవాలి



గుడివాడరూరల్: చెడు ప్రవర్తన కలిగిన వారు తమ ప్రవర్తనను, తీరు మార్చుకుని నేరాలకు దూరంగా క్రమశిక్షణతో జీవించాలని గుడివాడ తాలూకా ఎస్ఐ ఎన్.చంటిబాబు సూచించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మండలంలో చెడు నడత కలిగిన రౌడీషీటర్లకు సోమవారం కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఉన్న రౌడీషీటర్లు, చెడునడత ఉన్న వ్యక్తులు నేరాలను వదిలి స్వేచ్ఛగా జీవించాలన్నారు. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే సమాచారం ఇవ్వాలన్నారు.

సాంకేతికత వేగవంతం



శిక్షణ పొందిన అధ్యాపకులతో ప్రిన్సిపాల్ డాక్టర్ కరుణకుమార్

గుడ్లవల్లేరు: వేగంగా అభివృద్ధి చెందుతున్న సాంకేతిక రంగానికి అనుగుణంగా అధ్యాపకులు కూడా విషయ పరిజ్ఞానంపై అవగాహన కలిగి ఉండాలని శేషాద్రిరావు గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ బుర్రా కరుణకుమార్ అన్నారు. కాలేజీలో సోమవారంతో అటల్ అకాడమీ సహకార ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ముగింపు కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఎంతోమంది అధ్యాపకులు శిక్షణ పొందారన్నారు. పారిశ్రామిక నిర్వహణలో నిరంతర అప్లికేషన్ అన్వేషణ, పారిశ్రామిక భద్రత, రక్షణ, పరిశోధనా వ్యాసాంగాలకు సంబంధించిన చర్చలు, తదనుగుణ మార్పులు–చేర్పులు చేసినట్లు పేర్కొన్నారు. సైద్ధాంతిక పరంగా ఈ ప్రోగ్రామింగ్ ద్వారా నేర్చుకున్న విషయ పరిజ్ఞాన నిరూపణకు ప్రాక్టికల్ సెషన్స్ పొందుపరచినట్లు ఈ కార్యక్రమ సమన్వయ కర్త డాక్టర్ సీహెచ్.కవిత తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్లు డాక్టర్ ఎం.కామరాజు, డాక్టర్ జి.ప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.కోదండ రామారావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆటల పోటీల్లో వల్లూరుపాలెం విద్యార్థుల ప్రతిభ



విజేతలైన విద్యార్థులతో హెచ్ఎం స్వరాజ్యలక్ష్మి

పామర్రు(తోట్లవల్లూరు): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయిలో నిర్వహించిన పలు ఆటల పోటీల్లో తమ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబర్చి నియోజవర్గ స్థాయి పోటీలకు ఎంపికయ్యారని వల్లూరుపాలెం హైస్కూల్ హెచ్ఎం స్వరాజ్యలక్ష్మి తెలిపారు. విజేతలైన విద్యార్థులను సోమవారం ఆమె అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత నెల 27వ తేదీన నార్త్ వల్లూరు జెడ్పీ హైస్కూల్లో ఈ పోటీలు జరిగాయని తెలిపారు. అండర్–14, అండర్–19 బాలుర, బాలికల విభాగాలకు సంబంధించి కబడ్డీ, వాలీబాల్, ఖో–ఖో, షటిల్, చెస్, యోగా పోటీల్లో తమ విద్యార్థులు విజేతలుగా నిలిచారని పేర్కొన్నారు.

సమాజంలో ఉపాధ్యాయులకు గుర్తింపు



వరుణ్‌కుమార్ ఉద్యోగ విరమణ కార్యక్రమంలో ఎమ్మెల్యే కుమారరాజా

యలమర్రు(పెదపారుపూడి): సమాజంలో ఉపాధ్యాయులకు ఎప్పుడూ మంచి గుర్తింపు ఉంటుందని ఎమ్మెల్యే వర్ల కుమారరాజా అన్నారు. మండలంలోని యలమర్రు హైస్కూల్లో హెచ్ఎం పనిచేసిన ఆర్.వరుణ్‌కుమార్ సోమవారం ఉద్యోగ విరమణ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో తహసీల్దార్ వై.రంగారావు తదితరులు పాల్గొన్నారు.

ఆటో చోరీ కేసును ఛేదించిన పోలీసులు

కూచిపూడి(మొవ్వ): కూచిపూడి పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం జరిగిన ఆటో చోరీ కేసును కూచిపూడి ఎస్ఐ ఎం.సుబ్రమణ్యం తమ సిబ్బందితో సీసీ కెమెరాల సాయంతో గంటన్నర వ్యవధిలో ఛేదించారు. పోలీసుల కథనం మేరకు మొవ్వ మండలం అయ్యంకి గ్రామానికి చెందిన పడమట నాగరాజు ఆటో నడుపుకుంటూ, కౌలుకు పొలం చేస్తూ జీవిస్తుంటాడు. సోమవారం కూచిపూడి–మొవ్వ గ్రామాల మధ్య ఉన్న తన కౌలు పొలంలో మందు కొట్టిద్దామని ఆటోను రోడ్డు పై పెట్టాడు. పొలం వెళ్లి తిరిగి వచ్చే సరికి ఆటో కనిపించ లేదు. ఈ మేరకు కూచిపూడి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కూచిపూడి ఎస్ఐ, తమ సిబ్బంది మూడు బృందాలుగా ఏర్పడి సీసీ కెమెరాలు, టెక్నికల్, నాన్ టెక్నికల్ సమాచారంతో పామర్రు గ్రామానికి చెందిన శివ అనే వ్యక్తి దొంగతనం చేశాడని తెలుసుకుని గంటన్నర వ్యవధిలో కేసుని ఛేదించి ఆటోని రికవరీ చేశారు. అలాగే నిందితుడ్ని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఉద్యోగి విధులను అడ్డుకున్న వ్యక్తికి ఏడాది జైలు

మొవ్వ: ప్రభుత్వ ఉద్యోగి(డాక్టర్) విధులను అడ్డుకున్న ఒక వ్యక్తికి ఏడాది కారాగార శిక్ష, రూ.10,200 జరిమానాను మొవ్వ జేఎఫ్‌సీఎం కోర్టు విధించినట్లు కూచిపూడి ఎస్ఐ ఎం.సుబ్రమణ్యం సోమవారం తెలిపారు. 2020వ సంవత్సరంలో మొవ్వ గ్రామానికి చెందిన తుమ్మల చక్రపాణి అనే వ్యక్తి మద్యం మత్తులో పీహెచ్‌సీకి వెళ్లి కేకలు వేయటమే కాకుండా పీహెచ్‌సీలో విధులు నిర్వహిస్తున్న డాక్టర్‌గా శొంటి శివరామకృష్ణను అసభ్యకరంగా తిట్టటమే కాకుండా చంపుతానని బెదిరించాడు. ఈ మేరకు డాక్టర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి కోర్టుకి హాజరుపరిచారు. సదరు కేసుపై మొవ్వ జడ్జి పీ రాజన్ ఉదయ్ ప్రకాష్ సోమవారం తీర్పును వెల్లడించారు.

విద్యార్థి అదృశ్యం

నందివాడ: స్థానిక జెడ్పీ హైస్కూల్లో పదో తరగతి చదువుతున్న దుంపల సాత్విక్ శనివారం నుంచి కనిపించడం లేదు. నందివాడ మండలం లక్ష్మీనరసింహపురం గ్రామానికి చెందిన సాత్విక్ శనివారం సాయంత్రం ఆరు గంటలకు అదే గ్రామానికి చెందిన వాళ్ల మామయ్య ఇంటి నుంచి బయటకి వెళ్లి మళ్లీ తిరిగి ఇంటికి రాలేదు. సాత్విక్ బ్లూ గళ్ల షర్టు, బ్లూ ప్యాంటు గల స్కూల్ యూనిఫామ్ ధరించి ఉన్నాడు. అతని వద్ద బ్యాగ్ కూడా ఉంది. విద్యార్థి ఆచూకీ తెలిసిన వారు తెలియజేయాలని నందివాడ ఎస్సై శ్రీనివాసు కోరారు.

సంక్షిప్త వార్తలు

■ **బాధితుడికి రూ.50 వేల సాయం**

పామర్రు(తోట్లవల్లూరు): మండలంలోని గరికపర్రు గ్రామానికి చెందిన బీవీఆర్ యూత్ సభ్యుడు కార్తీక్‌కు వారం రోజుల కిందట జరిగి ఓ ప్రమాదంలో అతడి తలకు తీవ్రగాయమైంది. ఆస్పత్రిలో చికిత్స పొంది ఇంటికి వచ్చిన నేపథ్యంలో కార్తీక్‌కు సోమవారం దాత బొమ్మారెడ్డి వెంకటరెడ్డి రూ.50 వేలను సాయంగా అందజేశారు. అంతే కాకుండా కార్తీక్ కోలుకునే వరకు కుటుంబ పోషణకు అవసరమైన నిత్యావసర సరుకులను కూడా అందజేస్తానని కుటుంబ సభ్యులకు తెలిపారు. మనస్సున్న మారాజు వెంకటరెడ్డికి కార్తీక్ కుటుంబ సభ్యులు హృదయపూర్వకంగా కృతజ్ఞతలు తెలిపారు. బీవీఆర్ యూత్ అధ్యక్షుడు శ్యామ్ పాల్గొన్నారు.

■ **దసరా ఉత్సవ కమిటీ ఏర్పాటు**

కైకలూరు: స్థానిక శ్యామలాంబ దేవస్థానంలో దసరా ఉత్సవాలు ఈ నెల 3వ తేదీ నుంచి 13 వరకు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ఉత్సవాల కమిటీ సభ్యులుగా పంద్రంగి కనకదుర్గాప్రసాద్, బలరామకృష్ణ, శ్యాంప్రసాద్, రాంబాబు, రామ్మోహనరావు, వెంకటరావు, రాఘవరావు, రామస్వామి, శంకర శాస్త్రీ, కారుణ్య నియమితులయ్యారు.

■ **3 నుంచి దత్తాశ్రమంలో కోటి కుంకుమార్చన**

మండవల్లి: మండలంలోని లోకుమూడి గరువు దత్తాశ్రమంలో శ్రీ గణపతి సచ్చిదానంద స్వామిజీ దివ్య ఆశీస్సులతో, దత్తపీఠ ఉత్తరాధికారి శ్రీ దత్త విజయానంద తీర్థ స్వామిజీ ఆశీస్సులతో ఈ నెల 3 నుంచి 12వ తేదీ వరకు శత చండీ హోమ సహిత కోటి కుంకుమార్చన నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆశ్రమ ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ గురజాడ ఉదయ్‌శంకర్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భక్తులు ఈ కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

■ **రేపు గ్రామ సభలు**

మండవల్లి: మండలంలోని గ్రామ పంచాయతీల్లో ఈ నెల రెండో తేదీన గ్రామ సభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ టీ వెంకటరమణ సోమవారం తెలిపారు. ఉదయం 10 గంటలకు ఉనికిలి, పుట్లచెరువు గ్రామాల్లో, 10.30 గంటలకు మండవల్లి, పెరికెగూడెం, 11.00 గంటలకు కొవ్వాడలంక, మూడుతాళ్లపాడు, నందిగామలంక, నుచ్చుమిల్లి, ప్రత్తిపాడు, పులపర్రు, లోకుమూడి 11.30 గంటలకు తక్కెళ్లపాడు, సింగనపూడి, 12 గంటలకు కొర్లపాడు, పసలపూడి, 12.30కు మొఖాసాకలవపూడి, రెండు గంటలకు మణుగునూరు, పెనుమాకలంక, మూడు గంటలకు లింగాలలో గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ పేర్కొన్నారు.

■ **ఆర్ట్, క్రాఫ్ట్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ**

కలిదిండి(కైకలూరు): రాష్ట్ర స్థాయిలో ఆర్ట్, క్రాఫ్ట్ పోటీల్లో తాడినాడ అల్లూరి జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు పలు బహుమతులు పొందారు. కాకినాడకు చెందిన క్రియేటివ్ ఆర్ట్స్, అకాడమీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ 9వ వార్షికోత్సవం సందర్భంగా జూలైలో కొరియర్ ద్వారా చిత్రాలను పంపించాలని కోరింది. దీంతో తాడినాడ పాఠశాలకు చెందిన విద్యార్థులు అన్విత, నందిని, నాగసౌజన్య ఆర్ట్ విభాగంలో, క్రాఫ్ట్ విభాగంలో హరిశ్చంద్రప్రసాద్, గౌరీశంకర్, విజయసాయి వర్మ పాల్గొన్నారు. విజేతలకు కాకినాడ న్యూ సెంచరీ హైస్కూల్‌లో సెప్టెంబరు 29న బహుమతులు అందజేశారు.

మోటార్లతో వర్షం నీరు తొలగింపు



మండవల్లి ఎస్సీ ఏరియాలో రోడ్లపై వర్షం నీటిని తోడిస్తున్న సర్పంచ్ ఝాన్సీ

మండవల్లి: మండవల్లి ఎస్సీ ఏరియాలో సోమవారం వర్షపు నీటిని సర్పంచ్ మెండా ఝాన్సీ మోటార్లతో తోడించారు. ఇటీవల కురిసిన అధిక వర్షాలకు ఎస్సీ ఏరియాలో రహదారులపై వర్షం నీరు నిలిచి గ్రామస్తులు సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ వర్షం నీటి కారణంగా దోమలు వృద్ధి చెంది ప్రజలకు అంటువ్యాధులు సోకే అవకాశం ఉందన్నారు. దీంతో టైఫాయిడ్, మలేరియా వంటి వ్యాధులు సోకే ప్రమాదముందన్నారు. ఈ కారణంగా ఎప్పటికప్పుడు రహదారులపై నీరు నిల్వకుండా మోటార్లతో తోడిస్తున్నట్లు పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ నాయకుడు మెండా సురేష్ పాల్గొన్నారు.

వాకర్స్ డిస్ట్రిక్ట్ గవర్నర్‌గా సుబ్బారావు



పదవులు పొందిన సభ్యులతో అంతర్జాతీయ సెక్రటరీ జనరల్ ఐజక్

గుడివాడ టౌన్: వాకర్స్‌క్లబ్ కృష్ణా జిల్లా 2025 గవర్నర్‌గా గుడివాడ ఎన్టీఆర్ స్టేడియం వాకర్స్‌క్లబ్ సభ్యుడు సనకా సుబ్బారావు ఎంపికయ్యారు. కృష్ణా జిల్లా ఎలక్ట్ గవర్నర్‌గా లోయ ఈశ్వర వెంకటేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు వాకర్స్ అంతర్జాతీయ సెక్రటరీ జనరల్ ఐజక్ ధ్రువీకరించినట్లు క్లబ్ గుడివాడ అధ్యక్షుడు మెరుగుమాల శివరామకృష్ణ తెలిపారు. సెప్టెంబర్ 29న విజయవాడలో జరిగిన అంతర్జాతీయ ఎన్నికల్లో వీరిరువురును ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. గుడివాడ పట్టణానికి చెందిన సభ్యులు ఇంతటి ఉన్నత పదవులు పొందడం క్లబ్‌కు గర్వకారణమన్నారు. గవర్నర్ల ఎంపికపై మాజీ గవర్నర్ ఎంఆర్ ప్రసాదు, బొగ్గారపు తిరుపతయ్య, పి.చంద్రశేఖరరావు అభినందనలు తెలిపారు.

నైతిక పాఠ్యాంశాలను బోధించాలి



విజేతలకు బహుమతులను అందజేస్తున్న ఎంఈఓ



విజేతలను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ పూర్ణచంద్రారెడ్డి

పామర్రు: విద్యా సంస్థల్లో నైతిక పాఠ్యాంశాలను తప్పనిసరిగా బోధించాలని పామర్రు ఎంఈఓ–2 పద్మవాణి పేర్కొన్నారు. స్థానిక జమీ అతే కార్యాలయంలో నైతికతయే నిజమైన స్వేచ్ఛ ఉద్యమం సందర్భంగా అవగాహన సదస్సును సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరిమితులతో కూడిన స్వేచ్ఛ వలననే నవ సమాజం ఏర్పడుతుందన్నారు. అతి స్వేచ్ఛ అనర్థాలకు దారి తీస్తుందన్నారు. యువత నైతిక విలువలను పాటించినప్పుడే సమాజం మంచిగా మారుతుందని తెలిపారు. గౌరవ అతిథులుగా కరీముద్దీన్, శ్రీనివాస స్కూల్ ప్రిన్సిపాల్ నాయక్, లాజరస్, వన్య ప్రసంగించారు. అనంతరం విజేతలకు బహుమతులను అందజేశారు.

ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకోవాలి

పామర్రు: విద్యార్థులు ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకోవాలని పామర్రు ఏఎస్ఎం హైస్కూల్ ప్రిన్సిపాల్ ఏ పూర్ణచంద్రారెడ్డి పేర్కొన్నారు. స్థానిక యలమర్రురోడ్డులోని ఏఎస్ఎం హైస్కూల్లో సోమవారం వ్యాసరచన పోటీలో విజేతలను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పామర్రు జమాతే ఇస్లామీ మహిళా విభాగం వారు నిర్వహించిన వ్యాసరచన పోటీలో ఉత్తమప్రతిభ కనబర్చి విజేతలకు నగదు పురస్కారం, సర్టిఫికెట్లు అందించినట్లు తెలిపారు.

బీసీ హాస్టల్ తనిఖీ



వసతి గృహ విద్యార్థులతో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి వీవీఎన్‌వీ లక్ష్మి

కైకలూరు: బీసీ బాలుర వసతి గృహంలో విద్యార్థులకు మౌలిక వసతుల కల్పనపై కైకలూరు మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్‌పర్సన్, సీనియర్ సివిల్ జడ్జి వీవీఎన్‌వీ.లక్ష్మి సోమవారం తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న దుప్పట్లు, తాగునీటి వసతి, ఆహారం, చదువుపై ఆరా తీశారు. వసతిగృహంలో కింద భాగంలో పదో తరగతి వరకు, పై అంతస్తులో కాలేజీ స్థాయి విద్యార్థులు ఉంటున్నారని హాస్టల్ వార్డెన్ బి.నిర్మల తెలిపారు. అనంతరం రికార్డులను జడ్జి పరిశీలించారు. సుప్రీంకోర్టు ఆదేశాలతో వసతిగృహాలను తనిఖీ చేసినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వసతిగృహం ఫ్లోరింగ్ దెబ్బతిందని విద్యార్థులు తెలిపారు. కార్యక్రమంలో బార్ అసోషియేషన్ సెక్రటరీ ఎంఎస్ఎస్.రాజు తదితరులు పాల్గొన్నారు.